సాక్షి
అనకాపల్లి
గురువారం । 16 । మార్చి । 2023



రైతన్న 'జీ'వనా'డి'

వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది జీడిపంట ఆశాజనకంగా ఉంది. జిల్లాలో 28 వేల హెక్టార్లలో జీడి పండిస్తున్నారు. 8లో



పిచ్చికుక్క దాడి

పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో బుచ్చెయ్యపేట మండలంలో 20 మందికి గాయాలయ్యాయి. 8లో



ముస్తాబవుతోన్న స్టేడియం

భారత్- ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్ కోసం క్రికెట్ స్టేడియం ముస్తాబవుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్ల విక్రయం పూర్తయింది. 8లో

న్యూస్‌రీల్

విశాఖ డెయిరీ పాల ధర పెంపు



అక్కిరెడ్డిపాలెం (విశాఖ): విశాఖ డెయిరీ పాల ధరలు పెరిగాయి. పెరిగిన పాల ధరలు గురువారం నుంచి అమల్లోకి రానున్నాయని డెయిరీ యాజమాన్యం వెల్లడించింది. 500 ఎంఎల్ పాల ప్యాకెట్‌పై రూ.1, లీటర్ ప్యాకెట్‌పై రూ.2 పెరిగినట్లు పేర్కొంది.

ముగిసిన ఎన్‌క్యూఏఎస్ బృందం పర్యటన



వైద్యాధికారులతో మాట్లాడుతున్న బృంద ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో అత్యవసర సేవలు అందుతున్న తీరుపై జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు(ఎన్‌క్యూఏఎస్) బృందం పరిశీలన బుధవారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన పర్యటనలో తాము పరిశీలించిన అంశాల నివేదికను ఎన్‌క్యూఏఎస్‌కు నివేదిస్తామని బృందం ప్రతినిధులు డాక్టర్ కె.నారాయణ(కేరళ), డాక్టర్ దీప్‌నాందే డాంగేర్(నాగపూర్), డాక్టర్ సవిత(ఢిల్లీ) తెలిపారు. అంతకు ముందు వైద్యాధికారులతో బృందం సమావేశమయింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఆర్‌ఎంవో భారతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో అపర్ణకు 738 ర్యాంకు



నాతవరం: మండలంలోని ఎం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామానికి చెందిన చేబోలు అపర్ణకు జాతీయ స్థాయి నీట్ పీజీ పరీక్ష ఫలితాల్లో 738 ర్యాంకు వచ్చింది. ఆమె ఇంటర్మీడియట్ తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివింది. ఎంబీబీఎస్ శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీలో పూర్తి చేసింది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి నీట్ పీజీ పరీక్షల్లో 800 మార్కులనుగాను 635 మార్కులు సాధించి ఈ ర్యాంకు సాధించింది. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, సోషల్ మీడియా కన్వీనర్ కర్రి వెంకటరమణ అపర్ణను సత్కరించి అభినందించారు. తమ కుమార్తెకు ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు రాంబాబు, సరోజిని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు



భూ సర్వే గురించి సమీక్షిస్తున్న జేసీ కల్పనాకుమారి

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించవద్దని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఆమె అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు క్షేత్రస్థాయి అధికారులంతా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షలో భాగంగా మండలంలో భూముల రీసర్వే పురోగతిపై సమీక్ష జరిపిన జేసీ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. తహసీల్దార్ గంగాధరరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, ఆర్‌ఐలు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు క్రికెటర్ల స్వాగత బాధ్యతలు

గోపాలపట్నం: భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 19న జరిగే వన్డే మ్యాచ్‌లో భాగంగా విమానాశ్రయంలో క్రికెటర్ల స్వాగత బాధ్యతలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు అప్పగించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం అందించారు.

పట్టభద్రుల తరపున చట్టసభలో ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహించనున్న నాయకుడెవరో నేడు తేలనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1,119 బ్యాలెట్ బాక్సుల్లో 2,00,926 మంది నిక్షిప్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో లెక్క తేలితే.. 36 గంటల్లోపే ఫలితం వెలువడే అవకాశం ఉంది. లేదంటే 48 గంటల సమయం దాటనుంది. ఇందుకు తగినట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పట్టభద్రులు పట్టం కట్టేదెవరికో?



విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మాక్ కౌంటింగ్

- నేడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్‌కు 28 టేబుళ్లు ఏర్పాటు
- ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు
- పోలైన ఓట్లు 2,00,926.. లెక్కింపు సిబ్బంది 560 మంది
- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం వస్తే ఆనందమే..
- లేదంటే రెండు రోజుల పాటు కౌంటింగ్ జరిగే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తుది ఫలితం తేలటానికి సుదీర్ఘ సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రికి పూర్తవుతుందని అంచనా. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు కేటాయించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద 6 జిల్లాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థజైన్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, 6 జిల్లాల డీఆర్‌వోలు, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లను ఓపెన్ చేస్తారు. ర్యాండమ్‌గా బ్యాలెట్ బాక్సులను ఎంపిక చేసి, తెరవనున్నారు. ఇప్పటికే దీనిపై సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 28 టేబుల్స్‌ను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. 560 మంది సిబ్బందిని నియమించగా.. వీరికి ఒక్కో షిఫ్ట్‌కు 280 మంది చొప్పున విధులను కేటాయించారు. వీరితో పాటు సహాయకులుగా మరో 50 మందికి పైగా సిబ్బంది, అధికారులు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 280 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీచేశారు.



మాక్ కౌంటింగ్‌కు హాజరైన ఎన్నికల సిబ్బంది

కౌంటింగ్ భిన్నం.. అందుకే ఆలస్యం

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ప్రాధాన్యత అంకెల ప్రాతిపదికన రౌండ్లు ఉంటాయి. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయితే మొదటి రౌండ్ పూర్తయినట్టు పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు ఎన్ని అనేది తేలుతుంది. తొలి రౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరికెన్ని వచ్చాయనేది నిర్ధారిస్తారు. చెల్లని ఓట్లను పక్కన పడేస్తారు. చెల్లినవాటిలో 50 శాతం ఓట్లకు ఒకటి కలిపితే ఎన్ని ఓట్లవుతాయో.. దాన్నే కోటా(అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఓట్లు)గా నిర్ధారిస్తారు. మొత్తం 2,00,926 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లుపోగా మిగిలిన వాటిలో 50 శాతానికి, ఒక ఓటును అదనంగా కలుపుతారు. ఆ లెక్క మేరకు ఎవరికైతే అన్ని ఓట్లు వస్తాయో వారిని విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఆ సంఖ్యకు ఎవరూ చేరుకోకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అపుడు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి.. ఆ వ్యక్తికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను గణిస్తారు. వాటిని మిగతా అభ్యర్థులందరికీ పంచుతారు. ఈ విధంగా కోటా ఓట్లు వచ్చే వరకు అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ.. లెక్కింపును కొనసాగిస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలే వరకు కోటా ఓట్లను చేరుకోకపోతే.. అపుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయో.. వారినే విజేతగా ప్రకటించి, కౌంటింగ్ నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా ఫలితం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఇప్పటికే కౌంటింగ్ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పూర్తిగా ఎన్‌క్లోజర్స్ నడుమ ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ బాక్స్‌ను తెరిచే ముందు సంబంధిత ఏజెంట్లకు చూపిస్తారు. బ్యాలెట్ బాక్సులపై ఎలాంటి ట్యాంపరింగ్ కనిపించినా వెంటనే ఎన్నికల అధికారికి తెలియజేస్తారు. లెక్కింపు ప్రక్రియలో బ్యాలెట్ పేపర్ల లెక్కింపు, బ్యాలెట్ బాక్స్ సీల్ చెక్ చేయడం, పరిశీలన, చెల్లుబాటు ఓట్ల లెక్కింపు, ఎలిమినేషన్, డిక్లరేషన్ మొదలైన 6 దశలుంటాయి. లెక్కింపు సమయంలో ప్రతి రౌండ్ అనంతరం అభ్యర్థుల, ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. మొదటగా జారీ చేసిన 756 పోస్టల్ బ్యాలెట్లను ఓపెన్ చేస్తారు. అందులో చెల్లని ఓట్లను మినహాయించి, మిగిలిన వాటిని బ్యాలెట్ బాక్సుల్లో కలిపేస్తారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల నుంచి మొదట 25 చొప్పున బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కడతారు. ఇందుకోసం చాలా సమయం పట్టే అవకాశం ఉంది. కట్టలు కట్టిన బ్యాలెట్ పత్రాలను తెరిచి, చెల్లనివి, చెల్లుబాటయ్యే ఓట్లను రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వేరు చేస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ బ్యాచ్‌ల వారీగా జరుగుతుంది. ఒక్కో బ్యాచ్ లెక్కింపునకు సుమారు గంటన్నర సమయం పట్టే అవకాశం ఉంది. మొత్తం ఓట్లు లెక్కించటానికి దాదాపు ఏడెనిమిది గంటల సమయం పడుతుంది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున తదితరులు

మాక్ కౌంటింగ్ నిర్వహణ

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్టేడియంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయం మాదే..

పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి ఏయే ప్రాంతాల్లో ఎంత పోలింగ్ నమోదయిందన్న అంశాలపై ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులు గెలుపు విశ్లేషణలతో బిజీగా మారిపోయారు. జిల్లాలు, బూత్‌లవారీగా పోలైన ఓట్ల ద్వారా వారి మద్దతు అభ్యర్థులు ఎంత మేర అనుకూలంగా ఓటు వేశారనే అంశాలపై బేరీజు వేసుకున్నారు. ఏదేమైనా ఓటరు ఎవరివైపు మొగ్గు చూపుతున్నారనేది గురువారం రాత్రికి లేదా శుక్రవారం తెలియనుంది. అప్పటి వరకు ఉత్కంఠతను భరించాల్సిందే..!

డీఎస్సీ–98 అభ్యర్థుల ఖుషీ

- పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడి విశాఖలో 413 మందికి అవకాశం
- ఏకోపాధ్యాయ స్కూళ్లకు కేటాయింపు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ఆశావాహులు

విశాఖ విద్య : డీఎస్సీ–1998లో ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు ఉద్యోగాలు దక్కనున్నాయి. ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కల నెరవేరే సమయం ఆసన్నమైంది. క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్‌తో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసమని ఎదురుచూస్తున్న అభ్యర్థులు తాజా పరిణామాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 905 మంది డీఎస్సీ–98లో అర్హత సాధించారు. గత పాలకులెవ్వరూ వీరి గురించి పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వీరికి ఉపాధ్యాయ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించటంతో వీరికి ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను గతేడాది అక్టోబర్‌లో పరిశీలించారు. అభ్యర్థుల నుంచి అంగీకార పత్రాలను సేకరించారు. వీరిలో 413 మంది ఉపాధ్యాయ పోస్టుల్లో చేరేందుకు, ముందుకొచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు జాబితాను కమిషనర్ కార్యాలయంనకు నివేదించారు. తాజా ఉత్వర్వులతో త్వరలోనే మినిమిమ్ టైం స్కేల్ కింద వీరికి పోస్టింగ్‌లు దక్కనున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభ్యర్థులు(ఫైల్)

జాబితా సిద్ధం చేశాం



డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి అంగీకర పత్రాలను తీసుకొని ఇదివరకే కమిషనర్‌కు నివేదించాం.ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో బోధనకు ఆటంకం లేకుండా తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, ఉమ్మడి విశాఖ జిల్లా

హర్షించదగ్గ విషయం



ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీపై కూడా ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపుతుండటం హర్షనీయం. డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చి ప్రభుత్వం మరోమారు తన చిత్తశుద్ధిని చాటుకుంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

24 ఏళ్ల కల నెరవేరింది



డీఎస్సీ–98లో అర్హత సాధించిన మేము ఉద్యోగాల కోసమని 24 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మాకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటా నిలుబెట్టుకున్నారు. ఇన్నాళ్లకు మా కల నెరవేరుతోంది.

– కె.ఎల్.శ్రీనివాస్, క్వాలిఫైడ్ అభ్యర్థి, విశాఖపట్నం

నూకాంబిక హుండీ ఆదాయం లెక్కింపు

- నగదు రూ.50.44 లక్షలు, బంగారం 44.5 గ్రాములు



అమ్మవారి హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. 125 రోజుల తర్వాత జరిగిన ఈ లెక్కింపులో భక్తుల కానుకల ద్వారా రూ.50,44,071 నగదు, 44.500 గ్రాములు బంగారం, 2 కిలోల 40 గ్రాముల వెండి సమకూరినట్టు ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి లారస్ రూ.25 లక్షల విరాళం

ఎంవీపీకాలనీ: నగరంలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి లారస్ లాబ్స్ రూ.25 లక్షల విరాళం అందజేసినట్లు ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వి.ఉమామహేశ్వర రావు వెల్లడించారు. లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ ఈ మేరకు విరాళం అందజేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో క్యాన్సర్ చికిత్సలో మరింత ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. భారీ విరాళం ప్రకటించడంపై లారస్ ల్యాబ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు అండగా..



దివ్యాంగ విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ



విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

- ఉపకరణాల పంపిణీకి అనకాపల్లిలో గుర్తింపు శిబిరం నిర్వహణ
- 271మంది బాలబాలికలు హాజరు

అనకాపల్లి టౌన్: పద్దెనిమిదేళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్వహిస్తున్న గుర్తింపు శిబిరం బుధవారం అనకాపల్లిలో ప్రారంభమైంది. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్లో జరిగిన శిబిరానికి 271 మంది బాలబాలికలు వారి తల్లిదండ్రులతో హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు ఎక్స్‌అఫీషియో కోఆర్డినేటర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. దివ్యాంగ బాలల విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. గురు, శుక్రవారాల్లో చోడవరం, నర్సీపట్నంలలో నిర్వహించే శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో గుర్తించిన దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ ఉచితంగా అందజేస్తారు. తొలిరోజు అనకాపల్లిలో జరిగిన శిబిరానికి అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, మునగపాక, పరవాడ, యలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు, ఎంఈవో దివాకర్, జీసీడీవో వెంకటలక్ష్మి, శిబిరంలో పాల్గొన్నారు.

తొలిరోజు హాజరు 96.3 %

- ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం
- విద్యార్థులకు సకల సౌకర్యాలు
- నేటి నుంచి సెకండియర్ పరీక్షలు



అనకాపల్లి ఆదినారాయణ మహిళా కళాశాల కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటికొస్తున్న విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 34 కేంద్రాల్లో తెలుగు/ సంస్కృతం పరీక్ష జరిగింది. విద్యార్థులను కేంద్రాల్లోకి అరగంట ముందు నుంచే అనుమతించారు. కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించిన పోలీసులు ప్రతి విద్యార్థిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తరువాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, వారి సహాయకులు కేంద్రాల వద్దకు తోడుగా వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారు. అన్ని కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా వృత్తి విద్యాధికారి సుజాత పలు కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు తగిన సూచనలు చేశారు.

96.3 శాతం హాజరు...

జిల్లాలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ జనరల్ కోర్సుకు 11,125 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో తొలిరోజు 327 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 2,660 మందికి గాను 183 మంది హాజరు కాలేదు. మొత్తంగా 13,785 మంది విద్యార్థులకు 13,275 మంది (96.3 శాతం) పరీక్ష రాశారు. గురువారం నుంచి జరగనున్న సెకండియర్ పరీక్షలకు 16,236 మంది హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. అరగంట ముందు నుంచే పరీక్షకు అనుమతిస్తామని, నిమిషం కూడా ఆలస్యం కావడానికి వీల్లేదని, ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని జిల్లా వృత్తి విద్యాధికారి సుజాత సూచించారు. విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



అచ్యుతాపురం ప్రశాంతి ఇంటర్మీడియట్ కళాశాలలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలన



తెనుగుపూడి గురుకులానికి కేటాయించిన ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ఇంటర్ విద్యార్థులు

క్లుప్తంగా

తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్న అరెస్టు

రావికమతం : ఆస్తి తగాదాల నేపథ్యంలో సొంత తమ్ముడినే ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయాలని చూసిన అన్నను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన మడకా రమణ, అతని తమ్ముడు సింహాద్రినాయుడుకు కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 13న బైక్‌పై వెళ్తున్న తమ్ముడు సింహాద్రినాయుడిని ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేయాలని అన్న రమణ ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో సింహాద్రి నాయుడు తీవ్ర గాయాలతో బయటపడిన సంగతి తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి రమణను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడంతో 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి



పాయకరావుపేట : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీసు ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. తుని, గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన ఘటనలో 30 ఏళ్ల వయస్సు కలిగిన పురుషుడు మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో జారిపడి మృతి చెందాడని తెలిపారు. మృతుడు ఎరుపు రంగు షర్టు, నైట్ ప్యాంట్‌తో సుమారు 5 అడుగుల ఎత్తు కలిగి, ఉంగరాల జుట్టు కలిగి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపర్చడం జరిగిందన్నారు.

వరికుప్ప దగ్ధం

ఎస్.రాయవరం: మరో రెండు రోజుల వ్యవధిలో ఇంటికి చేరాల్సిన ధాన్యం అగ్నికి ఆహుతి కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కంటే బాబ్జీకి చెందిన రెండెకరాల విస్తీర్ణంలో పండిన వరిపంట కోత చేసి వరి కుప్పవేయగా బుధవారం అగ్నిప్రమాదంలో కాలిబూడిదయ్యింది. ఈ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని, వాటి నుంచి నిప్పులు రాలడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ కుప్ప నూర్పు చేస్తే సుమారు 60 బస్తాలు ధాన్యం వచ్చేదని రైతు బాబ్జీ తెలిపారు. కాలుతున్న వరికుప్పను నక్కపల్లి ఫైరింజన్ సిబ్బంది వచ్చి అదుపు చేసే ప్రయత్నం చేశారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

రైతన్న 'జీ'వనా'డి'

- దిగుబడులపై చిగురిస్తున్న ఆశలు
- జిల్లాలో 28 వేల హెక్టార్లలో జీడి పంట
- కొత్తగా 230 హెక్టార్లలో సాగు



జీడి చెట్టు నిండా పిక్కలు

నాతవరం: జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో ప్రధాన పంటల్లో ఒకటైన జీడిపంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. దీంతో రైతులు ఒకింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ పంటపైనే ఆధారపడి, దానిపై వచ్చిన ఆదాయంతోనే ఏడాదంతా జీవనం సాగిస్తారు. రెండేళ్లుగా మంచు ప్రభావంతో పురుగు పట్టి పాడైపోయి పంట పూర్తిగా చేతికందకుండా పోయింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో దిగుబడిపై రైతన్న ఆశలు చిగురించాయి. ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహించడంతో కొత్తగా జీడి సాగు పెంచేందుకు రైతులు దృష్టి సారించారు.

జిల్లాలోని 24 మండలాల్లో 28 వేల హెక్టార్లలో జీడి తోటలు సాగు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో మండలం ఒక్కంటికి వెయ్యి హెక్టార్లలోపే సాగు ఉంది. ఈ ఏడాది ప్రభుత్వం ప్రోత్సాహంతో కొత్తగా 230 ఎకరాలకు విస్తరించింది. వచ్చే ఏడాది మరింత జీడి తోటల విస్తీర్ణం పెరగనుంది. మెట్ట ప్రాంతాల్లో జీడి తోటలు పెంచేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇతర పంటలు కంటే జీడి పిక్కలపై తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందని చెబుతున్నారు. తెగుళ్లు రాకుండా ముందస్తుగా ప్రభుత్వం తోటబడి కార్యక్రమం ద్వారా ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు గ్రామసభలు ద్వారా అవగాహన కల్పించారు. ఏ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో వివరిస్తున్నారు. ఆదిశగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మండలాల్లో ఎక్కడ చూసిన జీడి తోటలు పిందె, పిక్కలతో కళకళాడుతున్నాయి. ఇప్పటి పరిస్థితులను బట్టి పరిశీలిస్తే ఎకరానికి 300 నుంచి 350 మధ్య కేజీలు జీడి పిక్కల దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉద్యావన శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. జీడి పిక్కలను గ్రామాల్లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉగాది నుంచి జీడి పిక్కల వ్యాపారం ప్రారంభం కానుంది.

ప్రభుత్వం ప్రోత్సాహం

కొత్తగా జీడి తోటలు వేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మొక్కలు సరఫరా చేయడంతోపాటు తోట పంట దశకు వచ్చేంత వరకు హెక్టారుకు ఏటా రూ. 4 వేల చొప్పున మూడేళ్లపాటు రూ.12 వేలు సాయాన్ని అందిస్తోంది. కొత్తగా జీడి తోటలు వేయాలకునే రైతులు గ్రామాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యానవన ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి అర్హత ప్రకారం సాయమందిస్తారు.

జిల్లాలో జీడి సాగయ్యే మండలాలు	
మండలం	జీడి సాగు హెక్టార్లలో..
నాతవరం	3,100
నక్కపల్లి	2,686
నర్సీపట్నం	1,265
రోలుగుంట	1,417
మాకవరపాలెం	1,235
గొలుగొండ	1,428
యలమంచిలి	1,113
రావికమతం	1,656
కశింకోట	1,324
కోటవురట్ల	2,514
పాయకరావుపేట	1,040

సూచనలు పాటిస్తే తెగుళ్లు నివారణ



తోటబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. మేము చెప్పే సూచనలు పాటిస్తే పూత, పిందెలు రాలిపోవు. వాతావరణ పరిస్థితులను బట్టి ఎక్కడైనా తెగుళ్లు సోకితే మా దృష్టికి తీసుకురావాలి. వాటి నివారణా చర్యలు చేపడతాం. జీడితోట పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది.

– సుదర్శన, ఉద్యానవన శాఖాధికారి, నర్సీపట్నం డివిజన్

పిచ్చికుక్క దాడి

- నాలుగు గ్రామాలకు చెందిన 20 మందికి గాయాలు
- 108 వాహనంలో ఆస్పత్రులకు తరలింపు



కాలిపై గాయంతో విద్యార్థి చిరంజీవి



కుక్క కాటుతో వృద్ధుడి అవస్థ

బుచ్చెయ్యపేట: పిచ్చికుక్క దాడిలో నాలుగు గ్రామాలకు చెందిన 20మంది గాయపడ్డారు. మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో బుధవారం మధ్యాహ్నం జనం పరుగులు తీశారు. కుక్క బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల మధ్య తిరుగుతూ ఎదుట పడిన వారందరిని కరిచి గాయపరిచింది. రోడ్డుపై వెళుతున్న వృద్ధులు, చిన్న పిల్లలు, మండల కేంద్రానికి పనులపై నడిచి వచ్చిన వారిపై పిచ్చికుక్క దాడి చేసింది. కొందరి కాళ్లపైన, శరీరంపై తీవ్రంగా గాట్లు పడి నరాలు దెబ్బతినడంతో మెరుగైన వైద్య సేవల కోసం అనకాపల్లి, చోడవరం ఏరియా ఆస్పత్రులకు 108లో తరలించారు. పిచ్చికుక్క దాడిలో బుచ్చెయ్యపేట, దిబ్బిడి, అయితంపూడి, కేపీ అగ్రహారానికి చెందిన 20మందితోపాటు పాడి గేదెలు, ఆవులు, దూడ పెయ్యలు, కోళ్లు గాయపడ్డాయి. స్థానికులు పంచాయతీ, వెటర్నరీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. బుచ్చెయ్యపేట వైద్యాధికారి కె.వెంకటకృష్ణ, సీహెచ్‌ఓ దేముడు, సూపర్‌వైజర్ త్రిమూర్తులు, హెచ్‌వి కనక మహాలక్ష్మి తదితర్లు బాధితులకు వైద్య సేవలు అందించి వ్యాక్సినేషన్, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

ముస్తాబవుతోన్న స్టేడియం

- 19న భారత్– ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్
- జోరుగా బ్లాక్ టికెట్ల విక్రయాలు!



క్రికెట్ స్టేడియం వద్ద కౌంటర్లలో సోల్డ్ అవుట్ బోర్డులు

పీఎంపాలెం: భారత్–ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ముస్తాబవుతోంది. ఇరు జట్ల మధ్య ఈ నెల 19న డేనైట్ వన్డే మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్ విక్రయాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆన్‌లైన్‌లో పేటీఎం యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో నగరంలోని మూడు ప్రాంతాల్లో విక్రయాలు జరిపారు. బుధవారం కూడా కొంతమంది క్రికెట్ అభిమానులు టికెట్ల కోసం స్టేడియం వద్దకు చేరుకున్నారు. అయితే కౌంటర్ల వద్ద సోల్డ్ అవుట్ బోర్డులు చూసి నిరాశతో వెనుదిరిగారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారికి ఆధార్‌తో ఫిజికల్ టికెట్లు అందజేశారు. కాగా.. ఈ మ్యాచ్‌కు పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. మ్యాచ్‌ను తిలకించేందుకు విశాఖ నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు రానున్నారు. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇరుదేశాల క్రీడాకారులు, మ్యాచ్‌ను తిలకించడానికి వచ్చే ప్రముఖులు, క్రీడాభిమానుల భద్రతపై దృష్టి సారించారు. స్టేడియం వద్ద మునుపెన్నడూ లేని విధంగా ఎత్తైన బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి ప్రవేశించే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు సిద్ధం చేశారు. టికెట్ ఉన్న వారికి మాత్రమే స్టేడియం ఆవరణలోకి ప్రవేశం ఉండేలా చర్యలు చేపట్టారు. మరోవైపు బ్లాక్ టికెట్ల అమ్మకాలు జోరుగా సాగినట్లు తెలిసింది. అయితే నగదు బదిలీ అంతా యూపీఐ యాప్‌ల ద్వారానే సాగింది. రూ.1,500 టికెట్ రూ.2,500కు, రూ.2,000 టికెట్‌ను రూ.3,000 విక్రయించినట్లు సమాచారం. గతంలో స్థానికులు స్నేహితుల కోసం టికెట్ కొనుగోలు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ప్రస్తుతం క్షణాల్లోనే ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయడంతో స్థానికులంతా బంధువులు, స్నేహితుల కోసం టికెట్ కొనుగోలుకు ఆసక్తి చూపారు.

మోసపోతే ఫోరాన్ని ఆశ్రయించొచ్చు

వినియోగదారుల ఫోరం న్యాయమూర్తి తనూజారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న తనూజారెడ్డి



సదస్సుకు హాజరైన అధికారులు, వినియోగదారుల సంఘాల సభ్యులు

అనకాపల్లి టౌన్: మనం కొనుగోలు చేసే వస్తువు పాడైనా లేదా మోసపోయినట్లయితే తక్షణమే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలని ఫోరం న్యాయమూర్తి జి.తనూజారెడ్డి సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో చాలా మంది మోసపోతున్నారని వాపోయారు. షాపులు, ఆన్‌లైన్లో కొనుగోలు చేసిన వస్తువులకు వినియోగదారుల చట్టం కిందకు వర్తిసుందన్నారు. రూ.50 లక్షల ఖరీదైన వస్తువుకు హక్కులుంటాయన్నారు. వినియోగదారుల హక్కులపై ఇన్‌చార్జి డీఎస్‌వో సీఆర్. కల్యాణి వివరించారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ హక్కుల పట్ల వినియోగదారులను మరింత చైతన్యవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ ఏడీ అభిప్రియ, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీలత, అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి, ఏఎస్‌వో నందకిశోర్, డీటీలు అప్పలనాయుడు, లీల, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కె.జగన్నాథరావు, బి.జగ్గ అప్పారావు, ఆర్.రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు




ప్రమాదంలో గాయపడిన చిరంజీవి



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్

రోలుగుంట : నర్సీపట్నం–వడ్డాది ఆర్అండ్‌బీ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న నర్సీపట్నం ఆర్టీసీ బస్సు, మోటారు బైకు మంగళవారం అర్ధరాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గ్రాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం డిపోకి చెందిన ఆర్టీస్సీ బస్సు మంగళవారం రాత్రి చోడవరం వెళుతుండగా కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలేనికి చెందిన కొటిపల్లి చిరంజీవి(41) రోలుగుంట నుంచి తన స్వగ్రామం బైకుపై వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరంజీవికి కుడికాలు, కుడిచేయి ఫ్రాక్చర్ అయింది. వెంటనే స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కెజీహెచ్‌కి మెరుగైన చికిత్సకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ జప్తునకు ఆదేశాలు



మాట్లాడుతున్న న్యాయస్థానం ఫీల్డ్ ఆఫీసర్ తమరునితాబేగం

అనకాపల్లిటౌన్ : స్థానిక ఏఎంసీ కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని జప్తు చేయాలంటూ బుధవారం న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయస్థానం ఫీల్డ్ అధికారిణి తమరునితా బేగం జప్తు చేసేందుకు వెళ్లగా ఆ శాఖ జిల్లా అధికారి అజయ్‌బాబు అడ్డుకున్నారు. వివరాలివి.

1994లో మండలంలోని మార్టూరు గ్రామంలో ఎస్సీ బాలుర వసతిగృహాన్ని అదే గ్రామానికి చెందిన పి.సత్యనారాయణకు చెందిన భవనంలో అద్దెకు నిర్వహించేవారు. 2005 వరకు వసతి గృహాన్ని అదే భవనంలో కొనసాగించారు. తర్వాత ప్రభుత్వ స్థలంలో నూతన భవనం నిర్మించి వసతి గృహాన్ని అక్కడికి తరలించారు. అయితే వసతిగృహ నిర్వహణ సరిగా లేక తన భవనం శిథిలావస్థకు చేరుకుందని, నష్ట పరిహారం కోరుతూ ఆ శాఖ అధికారులకు సత్యనారాయణ అదే ఏడాది లేఖ రాశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో 2006లో సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాల పిదప న్యాయస్థానం 2018లో కక్షిదారుడు సత్యనారాయణకు సాంఘిక సంక్షేమశాఖ రూ.4.50 లక్షలు పరిహారంగా ఇవ్వాలంటూ తీర్పునిచ్చింది. సంక్షేమ శాఖ అధికారులు ఆ ఉత్తర్వుల్ని అమలు చేయకపోవడంతో 2020లో సత్యనారాయణ మరోసారి కోర్టునాశ్రయించారు. న్యాయ స్థానం వాదోపవాదాల పిదప సాంఘిక సంక్షేమ శాఖ భవనాన్ని జప్తు చేయాలంటూ మంగళవారం తీర్పునిచ్చింది. ఈ మేరకు న్యాయస్థానం ఉత్తర్వులతో కోర్టు ఫీల్డ్ ఆఫీసర్ బేగం ఏఎంసీకాలనీలో ఉన్న భవనాన్ని జప్తు చేసేందుకు ప్రయత్నించగా, అజయ్‌బాబు ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయస్థానం నుంచి కొంత సమయం కావాల్సిందిగా కోరారు.

20 నుంచి ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో బుధవారం ఉభయ తెలుగు రాష్ట్రాల ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీల కరపత్రాన్ని నాటిక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. జ్యోతిసరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ పోటీలకు ఎంహెచ్ స్కూల్ 1975 బ్యాచ్ విద్యార్థుల సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.హెచ్.నాయుడు, బి.జగత్‌రావు, కె.ఎం.నాయుడు, నందూరి ప్రభాకరరావు, జి.ఎస్.మూర్తి, రాపేటి నారాయణరావు, మళ్ల లోకేశ్వరరావు, భీశెట్టి కృష్ణ అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తానని రూ. 17.50 లక్షలు వసూలు!

బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు



బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యువకులు

బుచ్చెయ్యపేట : మండలంలోని పోలేపల్లి మాజీ సర్పంచ్ సీతా వెంకట రమణపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు అదనపు ఎస్‌ఐ సీహెచ్ నాయుడు తెలిపారు. పోలేపల్లి, బుచ్చెయ్యపేట, కందిపూడి, చిట్టియ్యపాలెం గ్రామాలకు చెందిన పలువురు నిరుద్యోగ యువకుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసగించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బుధవారం పోలేపల్లికి చెందిన సీతా గణేష్, కందిపూడికి చెందిన తాటికొండ రమణ, కొల్లి కొండబాబు, చిట్టియ్యపాలేనికి చెందిన వడ్డాది శ్రీను,బుచ్చెయ్యపేటకు చెందిన తాటికొండ కాంతారావులు పోలేపల్లి మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు. టీచర్ పోస్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద షిప్టు ఆపరేటర్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ దగ్గర నుంచి రూ.17.50 లక్షలు వసూలు చేశాడన్నారు. డబ్బులు తీసికుని ఆరేళ్లు దాటినా ఉద్యోగాలు ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని అదనపు ఎస్‌ఐ తెలిపారు.

కాసులు కురిపించిన వాహనాల వేలం

- ఎక్సైజ్ దాడుల్లో సీజ్ చేసిన 29 ద్విచక్రవాహనాలు, ఆటోలు వేలం
- రూ.5.88 లక్షల ఆదాయం



వాహనాల వేలానికి తరలి వచ్చిన వేలంపాటదారులు

చోడవరం రూరల్ : ఎక్సైజ్ దాడులలో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయడం ద్వారా రెట్టింపు ఆదాయం సమకూరింది. ముందుగా రూ.5వేల ధరావత్తు చెల్లించి వేలం పాటదారులు పోటెత్తారు. అధికారులు 29 ద్విచక్ర వాహనాలు, ఆటోలను వేలానికి సిద్ధం చేశారు. వేలంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఖరీదు కట్టిన ధరకు రెట్టింపు ఆదాయం సమకూరింది. ఈ వాహనాల అప్‌సెట్ ధర రూ.2,70,500లుగా నిర్ణయించగా, పోటీదారులు ఆయా వాహనాలను సుమారు 217 శాతం అధికంగా రూ.5,87,640లకు కొనుగోలు చేశారు. వేలం పాటలో పాల్గొనడానికి 47 మంది డిపాజిట్లు చెల్లించారు. పాటలో వాహనాలు దక్కించుకోలేని వారికి డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లించారు. అనకాపల్లి ఎక్సైజ్ సూరింటెండెంట్ రవికుమార్ నేతృత్వంలో జరిగిన వేలంపాట సజావుగా సాగడానికి ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బంది కృషి చేశారు.

నెలాఖరులోగా శతశాతం ఇంటి పన్నుల వసూళ్లు

పంచాయతీ కార్యదర్శులకు డీపీవో శిరీషారాణి ఆదేశం



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీవో శిరీషారాణి

కె.కోటపాడు: జిల్లాలోని 646 పంచాయతీల్లో రూ.31 కోట్ల ఇంటి పన్ను బకాయిలకుగాను ఇప్పటికి 60 శాతం వసూళ్లయినట్లు డీపీవో ఆర్.శిరీషారాణి తెలిపారు. ఈ నెలాఖరులోగా మిగిలిన బకాయిలు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. బుధవారం ఆమె కె.కోటపాడు ప్రధాన వీధుల్లో పారిశుధ్యం మెరుగు పనులను పరిశీలించారు. అనంతరం శివాలయం వద్ద కోనేరును పరిశీలించి మొక్కలను నాటించడం, దాతల సహాయంతో బెంచీలను ఏర్పాటు చేయించాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు సూచించారు. మొదటి విడతగా కె.కోటపాడు, వారాడ గ్రామ పంచాయతీల్లో చెరువుల సుందరీకరణ చేయాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో నెలకు ఒక చెరువు సుందరీకరణను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను సూచించారు. జిల్లాలో 476 గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పని చేస్తున్న 2012 మంది క్లాప్‌మిత్రలకు వేతనాలను చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ.69.11 కోట్లు చెల్లించే చర్యలను తీసుకోవాలని సూచించారు. పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, భీమరాజు, రమాదేవి, సౌజన్య, ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్ని దేవాలయాల్లో ఉగాది వేడుకలు

అనకాపల్లి టౌన్ : ఉగాది పర్వదినాన్ని అన్ని దేవాలయాల్లో ఘనంగా నిర్వహించాలని హిందూ సాంప్రదాయాల పరిరక్షణ సమితి సభ్యుడు ఆడారి కుమారస్వామి కోరారు. ఈ మేరకు జిల్లా దేవదాయ శాఖ అధికారి బుద్ద మహాలక్ష్మినగేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 22న తెలుగు నూతన సంవత్సరాన్ని అత్యంత ఘనంగా స్వాగతిస్తూ, అన్ని దేవాలయాలకు మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలంకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ రోజు ఉగాది పచ్చడి అన్ని దేవాలయాల్లో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, కొడుకుల శ్రీకాంత్, కొణతాల హరనాథబాబు, ఆడారి శ్రీనివాసరావు, పిట్ల లోకేష్ పాల్గొన్నారు.

19న పక్షుల కోసం మట్టి పాత్రల పంపిణీ

అనకాపల్లిటౌన్ : స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న మట్టి పాత్రలను పంపిణీ చేయనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పక్షులను కాపాడుకుందాం.. వాటికి తాగునీరు, గుప్పెడు తిండి గింజలు వేద్దాం అనే నినాదాన్ని ప్రజలంతా ఆచరించాలని కోరారు. వేసవికాలంలో ఇళ్లపై, చెట్లపై వాలే పక్షులకు తాగునీరు, తిండిగింజలు ఏర్పాటు చేసేందుకు మట్టి పాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్షిజాతి మనుగడకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



ఆయుర్వేదంపై అవగాహన సదస్సులో పోలీసు సిబ్బందితో డాక్టర్ లావణ్య

అనకాపల్లిటౌన్ : ఆయుర్వేద వైద్యంతో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చని ఆయుష్ వైద్యాధికారిణి కె.లావణ్య అన్నారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయుర్వేద వైద్యంపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదంపై చాలా మందికి అపోహలున్నాయని, అపోహలన్ని వీడి ఆయుర్వేదాన్ని అనుసరిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో దిశ సీఐ లక్ష్మి, ఎస్‌ఐ రాములమ్మ, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
సీఎస్‌ఐ	సత్యనారాయణస్క్రీన్-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
వాల్తేరు వీరయ్య	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,411 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,700	4,100
మొదటి రకం	3,500	3,930
రెండో రకం	3,430	3,760
మూడో రకం	3,100	3,400

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, బీ నెగిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 356 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 410 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

ఇరవయ్యేళ్ల కల.. నెరవేరిందిలా!

- రూ.1.70 కోట్లతో రోడ్డు నిర్మాణం పూర్తి
- తీరిన కశింకోట–వెదురుపర్తి రోడ్డు వెతలు
- మంత్రి అమర్‌నాథ్ చొరవపై స్థానికుల హర్షం



కశింకోట పంచాయతీ ప్రధాన రహదారిలో వేసిన మార్కింగ్ లైన్స్



మరమ్మతుల అనంతరం అందంగా తయారైన వెదురుపర్తి రోడ్డు (ఇన్‌సెట్) కశింకోట వద్ద శారదానది గట్టుపై వెదురుపర్తి వెళ్లే తారు రోడ్డు

కశింకోట : కశింకోట–వెదురుపర్తి గ్రామాల మధ్య రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో తారు రోడ్డు అందంగా రూపుదిద్దుకుంది. సుమారు రెండు దశాబ్దాలుగా ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు పనులు పూర్తి కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్ల తర్వాత.. మళ్లీ ఇపుడే..

రెండు దశాబ్దాల క్రితం నుంచే కశింకోట– వెదురుపర్తి గ్రామాల మధ్య రోడ్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హయాంలో 20 ఏళ్ల క్రితం ఈ రోడ్డును నిర్మించారు. అప్పట్లో ప్రజలు, రైతులు శ్రమదానం చేయడం, పంట భూములను స్వచ్ఛందంగా ఇవ్వడంతో పంచాయతీరాజ్ శాఖ నిధులతో పంట పొలాల మీదుగా సిమెంట్ రోడ్డు వేశారు. అది భారీ వాహనాల తాకిడి వల్ల దాదాపు ఐదేళ్ల క్రితం దెబ్బతింది. రోడ్డంతా గోతులమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించడానికి వెదురుపర్తితోపాటు, సమీప గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. గత టీడీపీ హయాంలో ఈ రోడ్డు పునర్నిర్మించడానికి హామీ ఇచ్చినప్పటికి అది నెరవేరలేదు.

మంత్రి చొరవతో రోడ్డు పూర్తి

ఈ నేపథ్యంలో స్థానికుల ఇబ్బందుల్ని గుర్తించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ తీసుకున్నారు. రోడ్డు మరమ్మతులకు ప్రత్యేకంగా రూ.కోటి 70 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆర్ అండ్ బీ శాఖ ఈ రోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి బదలాయింపు చేసుకుని గత ఏడాది పనులు చేపట్టారు. దీనిలో భాగంగా గోతులను పూడ్చి రోడ్డును చదును చేసి తారు రోడ్డు వేశారు. దీంతో రోడ్డు ఇపుడు అందంగా, సౌకర్యవంతంగా మారింది. దీనిలో భాగంగా కశింకోట వద్ద వెదురుపర్తి వెళ్లే పంచాయతీ ప్రధాన రహదారిని కూడా వెడల్పు చేసి జంక్షన్లలో ట్రాఫిక్ నియంత్రణకు మార్కింగ్ లైన్స్, రోడ్డు మార్జిన్ వేశారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డు ఇపుడు పనులు పూర్తి చేసుకుని, రాకపోకలకు అనువుగా మారడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి చొరవతోనే..

కశింకోట–వెదురుపర్తి రోడ్డు పునరుద్ధరణ మంత్రి అమర్‌నాథ్ చొరవ వల్లే సాధ్యమైంది. దీనికి రూ.కోటీ 70 లక్షలు మంజూరు చేసేందుకు ఆయన కృషి చేశారు. ఈ నిధులతో రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి, తారు రోడ్డుగా అభివృద్ధి చేశాం. కశింకోట ప్రధాన రహదారిలో మార్కింగ్ కూడా ఇచ్చాం. దీంతో రహదారిలో రాకపోకలు మెరుగుపడినట్టే.

–ఎస్.ధనుంజయ, డీఈ, రోడ్లు భవనాల శాఖ

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



నినాదాలు చేస్తున్న ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు

అనకాపల్లిటౌన్ : అడ్డపొగ సేవించడం ద్వారా క్షయవ్యాధి సంక్రమిస్తుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శారదాబాయి అన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో క్షయవ్యాధి నిర్మూలిద్దామంటూ నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజులకు మించి విపరీతమైన దగ్గు వస్తున్నప్పుడు దగ్గరలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి, కఫాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. క్షయవ్యాధిని మొదట్లోనే అణచివేద్దామంటూ ర్యాలీలో ఆశ కార్యకర్తలు, ఏఎస్‌ఎంలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీధర్, కిశోర్‌కుమార్, నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కశింకోట : స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద బుధవారం బీఎస్పీ అధినేత కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన సమాజ్ పార్టీ ఏర్పాటు చేసి, మాయావతిని ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాన్షీరాంకు దక్కుతుందని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సేవాస్తంబు రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్‌రాజు, దళిత నాయకులు వంకర వెంకటరావు, పి.సన్యాసిరావు, తట్టా కృష్ణ, చెవిటి అప్పలరాజు పాల్గొన్నారు.

ఈ క్రాప్ సవరణ తుది గడువు రేపు

- గ్రామ సభల ద్వారా ముసాయిదా తయారీ



పంటలకు ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)

అనకాపల్లి రూరల్ : రబీకి సాగుకు సంబంధించిన ఈ–క్రాప్ నమోదులో పొరపాట్ల సవరణకు ఈ నెల 17 వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు బుధవారం సాక్షికి తెలిపారు. గ్రామ సభల తర్వాత ఈ క్రాప్ తుది ముసాయిదాను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ రబీ సీజన్లో సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో అన్ని పంటలూ కలిపి 3,148 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు తెలిపారు. వరి, పొద్దుతిరుగుడు, నువ్వులు, మొక్కజొన్న, కంది, మినప, పెసర తదితర పంటల్ని రైతులు రబీలో సాగు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీ సభలు ఈ నెల 17 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ క్రాప్ నమోదులో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవడానికి ఈ అవకాశాన్ని రైతులు, ఆర్‌బీకే సిబ్బంది సద్వినియోగపరచుకోవాలని ఆయన సూచించారు. గడువు తర్వాత సవరణలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ఘనంగా స్వామివారి పెళ్లిరాట



పెళ్లిరాట మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరులో ఈ నెల 22న నిర్వహించనున్న భద్రావతి సమేత భావనారాయణ స్వామి కల్యాణానికి సంబంధించి బుధవారం పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. చేనేతలు, పద్మశాలీల ఆరాధ్య దైవమైన స్వామి వారి ఆలయంలో ఈ కల్యాణం నిర్వహించనున్నారు. సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీటీసీ ద్వారంపురెడ్డి వెంకట లక్ష్మి బాబ్జి, సచివాలయం కన్వీనర్ కాసుబాబు, దేవస్థానం చైర్మన్ మాడెం సూరి అప్పారావు, చేనేత సంఘం చైర్మన్ నూకరత్నం, సంఘం మేనేజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక జాతర మహోత్సవాలు



కోటవురట్ల: కె.వెంకటాపురంలో నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు పలు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 17,18 తేదీల్లో వాలీబాల్ టోర్నీ, 19, 20 తేదీల్లో మహిళల కబడ్డీ పోటీలు, 21న అమ్మవారికి విశేష పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 22న ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ తొలిరోజు పరీక్షలు



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ శ్రీనివాసరావు

పరవాడ: ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తానాం రెసిడెన్షియల్ కళాశాల, అచ్యుతాపురం ప్రశాంతి జూనియర్ కళాశాల, ఇస్లాంపేట జూనియర్ కళాశాలల నుంచి 425 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 16 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మొదటి సంవత్సరం పరీక్షలు 409 మంది విద్యార్థులు రాశారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్‌డీఎల్ కుమారి చెప్పారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట సీఐ పి.ఈశ్వరరావు, ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఉన్నారు. గురువారం 422 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారని సూపరింటెండెంట్ లలిత కుమారి చెప్పారు.

ఉచిత యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం రేపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పరమేశ్వరిపార్కు సమీపంలో ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని ఈ నెల 17న ప్రారంభించనున్నట్టు స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడిని జయించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉరుకులుపరుగులతోనే సరిపోతోందన్నారు. ప్రధానంగా మహిళలు రోజూ కనీసం గంట సమయాన్ని కేటాయించి ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

కశింకోట : కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బన్ని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పెంటకోట రాము, కాండ్రేగుల సతీష్, మళ్ల లోవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



జూనియర్ హైటెక్ సభ్యులతో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : యువత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మునగపాకలో జరిగిన పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు గురికాకుండా కష్టపడి చదువుకోవడంతో పాటు అవకాశం ఉన్న చోట ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో పెంటకోట శివ గణేష్, విల్లూరి మోహన్, దాడి సూరిబాబు, జూనియర్ హైటెక్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ తొలి రోజు పరీక్షలు



హిమశేఖర్ కళాశాల వద్ద రూమ్ నంబర్ కోసం నోటీస్ బోర్డులో వెతుక్కుంటున్న విద్యార్థులు



ఏఎంఏఎల్ కళాశాల పరీక్షా కేంద్రంలో హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో పలు విద్యాసంస్థల్లో బుధవారం ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 2,533 మంది విద్యార్థులకుగాను 2,502 మంది పరీక్షలకు హాజరయ్యారు. 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతో పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా నిఘా నేత్రంలో తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. సర్వేపల్లి, సంయుక్త, ఏఎంఏఎల్, ఆదినారాయణ, నారాయణ, చైతన్య, హిమశేఖర్, సాయికుల్వంత్ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. విద్యార్థులు ఆలస్యం కారణంగా, పరీక్షలకు హాజరుకాలేకపోయిన సంఘటనలు నమోదు కాలేదు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. తాళ్లపాలెం, కొక్కిరాపల్లి గురుకుల కళాశాలలు, యలమంచిలి ప్రభుత్వ కళాశాల నుంచి విద్యార్థులు ఈ కేంద్రానికి వచ్చి, పరీక్షలు రాశారు. 385 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 372 మంది హాజరయ్యారని, 13 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం తెలిపారు. డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో పరీక్షల ఏర్పాట్లు, విద్యార్థుల వసతులను పర్యవేక్షించారు.



పరీక్ష రాసిన అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు



తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో పరీక్షల తీరును పర్యవేక్షించిన ప్రిన్సిపాల్, ఎస్‌ఐలు

ఎంపీపీని కలిసిన చిరువ్యాపారులు



ఎంపీపీ గొర్లి సూరిబాబుకు వినతిపత్రం అందిస్తున్న చిరువ్యాపారులు

అనకాపల్లిటౌన్ : మాజీ సర్పంచ్ భర్త తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్నాడంటూ మండలంలోని కూండ్రం గ్రామానికి చెందిన 12 మంది చిరువ్యాపారులు స్థానిక ఎంపీపీ గొర్లి సూరిబాబు ముందు బుధవారం వాపోయారు. కేబీ రోడ్డు విస్తరణలో భాగంగా తమ దుకాణాలను ఆర్ అండ్ బీ అధికారులు కూల్చేశారని, తామంతా ఆర్ అండ్ బీ జేఈని ఆశ్రయించగా సదరు అధికారి రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్టు తెలిపారు. దీంతో తామంతా దుకాణాల ఏర్పాటుకు సిద్ధమవగా, మాజీ సర్పంచ్ భర్త కాంట్రాక్టర్లతో కుమ్మక్కై తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు వారంతా తమ గోడును వినతిపత్రంలో పేర్కొని ఎంపీపీకి అందించారు. తమ జీవనోపాధికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందిపై అపరాధ రుసుం



వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ రమేష్

అనకాపల్లిటౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 22 మంది వాహన చోదకులకు రెండో అదనపు న్యాయమూర్తి పి.వెంకటేశ్వర్లు రూ.64 వేలు అపరాధ రుసుం విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ అందించిన వివరాలు.. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాహనాల తనిఖీలో 22 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అపరాధ రుసుం విధిస్తూ తీర్పు నిచ్చినట్టు ఎస్‌ఐ వెల్లడించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

కష్టపడేవారికి సముచిత స్థానం



రామారావు, రమేష్‌లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, సత్యనారాయణ దంపతులు

కోటవురట్ల : పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన సమయంలో సముచిత స్థానం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. కైలాసపట్నంలోని జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి నివాసంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ చిక్కాల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి చిక్కాల రామారావు, పైల రమేష్ నిబద్ధతతో పనిచేశారని, పార్టీ గుర్తింపు కోసం శ్రమించారని దాంతోనే అధిష్టానం ఈ విధంగా గౌరవించిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. చిక్కాల రామారావు, పైల రమేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీని ఎల్లవేళలా విజయపథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం సందర్శించిన కలెక్టర్

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటర్ పరీక్ష కేంద్రమైన ప్రశాంతి జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి సందర్శించారు. అక్కడ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు తిలకించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. రైతులు ఆనందంగా సేవలు పొందడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులకు పాస్ పుస్తకాలు, ఇతర సేవల కల్పనలో రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



జగనన్నకాలనీలో నిర్మాణ సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎస్‌ఈ రామచంద్రన్ తదితరులు

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు అర్బన్ హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈ కె. రామచంద్రన్ సూచించారు. మండలంలోని పైడివాడ అగ్రహారం లేఅవుట్‌లో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ నెలాఖరుకు గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని లే అవుట్ ఇన్‌చార్జి, లబ్ధిదారుల తరఫున గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రతాప్‌ను ఆదేశించారు. ప్లింత్ బీమ్‌ల నాణ్యతను పరిశీలించారు. ఈ నెలాఖరుకు కనీసం 100 ఇళ్లు పూర్తి చేయడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. ల్యాబ్‌లలో క్యూబ్స్ కంప్రెసివ్ స్ట్రెంత్ పరీక్షలు చేశారు. ఈఈ ప్రసంగరాజు, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సుబ్రహ్మణ్యం, ఏఈ గోపాలకృష్ణ, లే అవుట్ ఇన్‌చార్జిలు ప్రేమ్, యువ, శివ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ కాలువల నిర్మాణం



తాళ్లపాలెం ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన సిమెంట్ కాలువలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఎన్టీఆర్ కాలనీలో సిమెంట్ కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ మేరకు సచివాలయ నిధుల నుంచి రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఎన్టీఆర్ కాలనీలో కాలువలు నిర్మించారు. గతంలో కాలువలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సిమెంట్ కాలువలు నిర్మించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్‌లు పర్యవేక్షించారు.